క్లుప్తంగా

ఆదోని కాంగ్రెస్ అభ్యర్థిగా రమేష్‌యాదవ్

ఆదోని టౌన్: కాంగ్రెస్ పార్టీ ఆదోని నియోజకవర్గ అభ్యర్థిగా రమేష్‌యాదవ్‌ను పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదోనికి వచ్చిన వైఎస్ షర్మిల పాత బస్టాండు సర్కిల్‌లో జరిగిన బహిరంగ సభలో ఆదోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రమేష్‌యాదవ్‌ను ప్రకటించారు.

గిట్టుబాటు వేతనం ఇవ్వాలి

ఆదోని రూరల్: ఉపాధి కూలీలకు రోజుకు రూ.300 వేతనం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు రంగనాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తూరు గ్రామ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు టెంట్లు, మజ్జిగ, నీటిని ఏర్పాటు చేయాలన్నారు.

ఎండకు తిరగొద్దు



గర్భిణి రిపోర్ట్స్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ అభిరూప్

కోసిగి: అవసరమైతే తప్ప ఎండకు తిరగొద్దని ప్రాథమిక వైద్యాధికారి అభిరూప్ సూచించారు. శుక్రవారం వందగల్లు గ్రామంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వందగల్లు, నేలకోసిగి గ్రామాలకు చెందిన పలువురు శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. షుగర్, బీపీ, రక్తహీనత, కాళ్లు, కీళ్ల నొప్పులు ఉన్న వారికి మందులు అందించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్ సునిత, ఎంఎల్‌హెచ్‌పీ ఉషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ఆరాధన

ఆదోని రూరల్: ఈనెల 22 నుంచి మండలంలోని కె.నాగలాపురం గ్రామంలో సద్గురు నరసావధూత స్వామి ఆరాధన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు శుక్రవారం తెలిపారు. 22న గురుపూజ, వినాయక పూజ, కలశ పూజలు, అన్నదానం ఉంటాయన్నారు. 23న గురుపూజ, తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఆస్పత్రిలో ప్రమాదాలపై అవగాహన



మంటలు ఆర్పే విధానాన్ని చూపుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆదోని అర్బన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 6వ రోజు శుక్రవారం స్థానిక వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో అగ్నిమాపక ప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ఆదోని ఇన్‌చార్జ్, జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆస్పత్రిలోని డాక్టర్లకు, సిబ్బందికి అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై ప్రాక్టికల్‌గా చూపించారు. పైఅంతస్తుల్లో అగ్నిప్రమాదం జరిగినప్పుడు రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాన్ని డెమో ద్వారా చూపించారు.

బదినేహాల్‌లో అగ్ని ప్రమాదం



మంటల్ని ఆర్పుతున్న గ్రామస్తులు

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాల్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం గుడిసె దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఇమామ్‌వలి గుడిసెలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటల్ని అదుపు చేసేలోగా పూర్తిగా కాలిపోయింది. బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలారు. ప్రమాదానికి షాట్‌సర్క్యూట్ కారణమా మరేదైనా ఉందా అనేది విచారణలో తేలాల్సి ఉంది.

పేదోడి ఆరోగ్యానికి జగనన్న సు'రక్ష'

- ఆరోగ్య కార్యకర్తల ద్వారా రోగులను గుర్తించిన ప్రభుత్వం
- ప్రతిఒక్కరికీ వైద్య పరీక్షలు, మందుల పంపిణీ
- అవసరమైన వారికి కార్పొరేట్ వైద్యం

పేదోడి ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేసి మరిన్ని వ్యాధులను అందులో చేర్చింది. ఫ్యామిలీ డ్టాకర్ కార్యక్రమం పేరుతో గ్రామాలకే ఫిజీషియన్‌ను పంపి వైద్య సేవలందించింది. ఇంకా మిగిలిపోయిన వారి కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేరుతో ఇంటింటికి ఆరోగ్య సిబ్బందిని పంపి రోగులను గుర్తించి వారందరినీ వైద్య శిబిరాలకు తీసుకొచ్చి వైద్య పరీక్షలు చేయించింది. మందులు, కళ్లద్దాలు పంపిణీ చేసింది. అవసరమైన వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు చేయించి పేదల సంపూర్ణ ఆరోగ్యానికి చర్యలు తీసుకుంది.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్



మందులను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఆదోని సెంట్రల్: ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పాటు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, ఆరోగ్యశ్రీ, విలేజ్ క్లినిక్స్ వంటి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ప్రజలకు వైద్య సేవలను అందిస్తోంది. ఎండ తీవ్రతను బట్టి ప్రజల ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని అధికారులు యథావిధిగా వార్డు సచివాలయాలు వారిగా ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహిస్తున్నారు. ఒక్కో క్యాంపులో 300 నుంచి 400 మంది దాకా వైద్య సేవలు పొందుతున్నారు. ఆదోని పట్టణంలో ప్రతి బుధవారం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారు.

అన్ని రకాల వైద్యసేవలు

ఆరోగ్య సురక్ష క్యాంపులలో ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలను అందించే విధంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతి క్యాంపులో ఇద్దరు ఎంబీబీఎస్ డాక్టర్లతో పాటు ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు ఉంటారు. వీరితో విలేజ్ క్లినిక్ హెల్త్ ఆఫీసర్లు ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొంటారు. ఆరోగ్య సురక్ష క్యాంపులో బీపీ, షుగర్, హెచ్‌బీ(హిమోగ్లోబిన్), టీబీ, యూరిన్ తదితర పరీక్షలను నిర్వహించి మందులను అందిస్తారు. మెరుగైన వైద్యం అవసరం అనిపిస్తే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తారు.

ఆరోగ్యానికి ఆసరా ఆరోగ్యశ్రీ

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టారు. అందులో తొలత 1,059 వ్యాధులకు మాత్రమే వైద్య సేవలను అందించేవారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆరోగ్యశ్రీ పథకాన్ని నిరుగార్చాయి. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ పథకానికి జీవం పోసింది. ప్రస్తుతం 3,255 వ్యాధులకు వైద్యసేవలు అందే విధంగా చర్యలు చేపట్టింది.

సద్వినియోగం చేసుకోండి



ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య సురక్ష క్యాంపులను ఏర్పాటు చేస్తున్నాం. క్యాంపులలో వైద్య పరీక్షలతో పాటు రక్త పరీక్షలు కూడా నిర్వహిస్తున్నాం. ఎండలు తీవ్రంగా ఉన్నాయి. దీర్ఘకాలిక వ్యాధులున్న వారు, బీపీ, షుగర్ ఉన్నవారు జాగ్రతలు తీసుకోవాలి. ఎంబీబీఎస్ డాక్టర్లతో పాటు స్పెషలిస్ట్ డాక్టర్లు కూడా అందుబాటులో ఉంటారు. ప్రతి ఒక్కరూ సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టరు సత్యవతి డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ, ఆదోని

వ్యక్తి ఆత్మహత్య

ఆదోని రూరల్: మండలంలోని బైచిగేరి గ్రామానికి చెందిన వడ్డే రామాంజనేయులు(47) అప్పుల బాధ తాళలేక శుక్రవారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు. రామాంజనేయులుకు దాదాపు రూ.6 లక్షలకు పైగా అప్పు ఉండడంతో ఎలా తీర్చాలనే మనోవేదనతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య ఉరుకుందమ్మ ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

విజేత వైఎస్సార్ జిల్లా వృషభాలు



నేమకల్లులో రాతి దూలం లాగుతున్న వృషభాలు

చిప్పగిరి: శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం నేమకల్లు గ్రామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వృషభాల రాతి దూలం లాగే పోటీల్లో వైఎస్సార్ జిల్లా వేంపల్లి మండలం గాజులపేటకు చెందిన పసుపులేటి రమణ వృషభాలు విజేతగా నిలిచాయి. శుక్రవారం ఉదయాన్నే ప్రారంభమైన పోటీల్లో 18 జతల వృషభాలు పాల్గొన్నాయి. విజేతగా వైఎస్సార్ జిల్లా వేంపల్లి వృషభాలు, తరువాతి స్థానాల్లో కర్నూలు జిల్లా జొన్నగిరి, అనంతపురం జిల్లా పేర్నిపాడుకు చెందిన వృషభాలు నిలిచాయి. విజేత వృషభాల యజమానులకు దాతలు బుసినె చంద్రశేఖర్ రూ.30 వేలు, ఎంపీపీ జూటూరు హేమలత రూ.25 వేలు, కుందనగుర్తి దివాకర్ రెడ్డి రూ.22,222 నగదు బహుమతులు అందించారు. సర్పంచ్ ప్రేమ్‌కుమార్, నాయకులు సత్తిరెడ్డి, సురేష్ రెడ్డి, సుంకన్న, భీమలింగ పాల్గొన్నారు.

ఖాదర్‌లింగస్వామి దయతో నాల్గోసారి విజయం మాదే



దర్గాలో ఫాతెహాల్లో పాల్గొన్న మంత్రాలయం అసెంబ్లీ అభ్యర్థి బాలనాగిరెడ్డి

- వైఎస్సార్‌సీపీ మంత్రాలయం అసెంబ్లీ అభ్యర్థి వై.బాలనాగిరెడ్డి

కౌతాళం: ఖాదర్‌లింగస్వామి దయతో నాల్గోసారి కూడా విజయం తమదేనని వైఎస్సార్‌సీపీ మంత్రాలయం అసెంబ్లీ అభ్యర్థి వై.బాలనాగిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి కౌతాళంలో జగద్గురు ఖాదర్‌లింగస్వామిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ స్వాగతం పలికి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం శాలువ పూలమాలతో సత్కారించారు. ఈ సందర్భంగా బాలనాగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి పక్ష పార్టీ ఎంతమందితో జట్టుకట్టుకొని వచ్చినా జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యంత్రి కావడం ఖాయమన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధే తమ పార్టీని అధికారంలోకి తెస్తుందన్నారు. ఆయన వెంట మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, సర్పంచ్ పాల్ దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, మాజీ సర్పంచ్ అవతారం, నాయకులు అబ్దుల్‌సమద్, ఉరుకుంద ట్రస్టుబోర్డు డైరెక్టర్ వెంకోబ, దావుద్, గుల్షన్ కమిటీ అధ్యక్షుడు మున్నపాషా, గౌరవ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకో

- ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే
- ఆదోని ఎమ్మెల్యే అభ్యర్థి సాయిప్రసాద్‌రెడ్డి



గోనబావిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని బీజేపీ అభ్యర్థి పార్థసారథికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సాయిప్రసాద్‌రెడ్డి హితవు పలికారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని, మరోసారి ఆదోని ఎమ్మెల్యేగా తనను భారీ మెజారిటీతో గెలిపించడం ఖాయమన్నారు. శుక్రవారం మండలంలోని సాదాపురం, గోనబావి, హువ్వనూరు గ్రామాల్లో సాయిప్రసాద్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాల ద్వారా రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. గతంలో చంద్రబాబునాయుడు 600 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకే తీసుకొచ్చారన్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. అవినీతికి తావు లేకుండా కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. వలంటీర్లు ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్ అందించాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదన్, నాయకులు గోవర్ధన్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కల్లుపోతుల సురేష్, మురళి, గోనభావి సర్పంచ్ ఆలీ, గొల్ల పెద్ద ఈరన్న, గొల్ల ఆనంద్, రాముడు, అక్బర్, జయరాజు, ఖాజా, పెద్దహరివాణం మధు, సంతోష్, నరసింహులు, కౌన్సిలర్ క్రిష్ణమోహన్, వీరేష్ పాల్గొన్నారు.

ఈసీఐ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల వివరాలు

- ఆర్వో, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ



ఆదోని అర్బన్: అభ్యర్థుల పూర్తి వివరాలు తెలుసుకోవాలంటే ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) వెబ్‌సైట్‌లో ఉంటాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివనారాయణశర్మ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆర్వో చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థితో పాటు నలుగురు మాత్రమే నామినేషన్ వేసేందుకు రావాలన్నారు. వంద మీటర్ల వరకు బారికేడ్లు ఏర్పాటు చేశామని, అభ్యర్థితో పాటు నలుగురే రావాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల ప్రచారంలో గానీ, సమావేశంలో గానీ ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్ వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. 26న పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటుందన్నారు. మే 13వ తేదీన ఎన్నికలు ఉంటాయన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగదు



మాట్లాడుతున్న దేవా

ఆదోని టౌన్: ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు తగదని బీజేపీ అభ్యర్థి పార్థసారథికి వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవా, మాజీ కౌన్సిలర్ సింహం నాగేంద్ర హితవు పలికారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని పార్థసారథికి సూచించారు. నాలుక కోస్తామని, పాతిపెడతామని వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. దేశానికి సేవ చేయాలనే సంకల్పంతో మోదీ తన కుటుంబాన్నే త్యాగం చేశారని, అలాంటి పార్టీలో పార్థసారథి కొనసాగుతూ అనాలోచిత ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. నాన్‌లోకల్ అభ్యర్థులకు ఆదోని ప్రజలు కచ్చితంగా ఓటుతో ధీటైన సమాధానమే చెబుతారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రవి, నారాయణ, గోవింద్, ఇక్బాల్, రంగస్వామి పాల్గొన్నారు.

నోరు అదుపులో పెట్టుకో..



మాట్లాడుతున్న మధుసూదనశర్మ

ఆదోని అర్బన్: నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని బీజేపీ అభ్యర్థి పార్థసారథిని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వెల్లాల మధుసూదనశర్మ హెచ్చరించారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిని నోటికొచ్చినట్టు మాట్లాడితే ప్రజలు ఓట్లు వేస్తారనే భ్రమ వీడాలన్నారు. గౌరవమైన వైద్య వృత్తిలో ఉంటూ అగౌరవంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. హుందాగా రాజకీయాలు చేయాలని సూచించారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ యూత్ కమిటీ రాష్ట్ర సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు: సంక్షేమ పథకాలు, గ్రామాల అభివృద్ధిని చూసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ యూత్ కమిటీ రాష్ట్ర సభ్యుడు వై.ప్రదీప్ రెడ్డి కోరారు. మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో సర్పంచ్ ఇస్మాయిల్‌తో కలిసి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ, కరపత్రాలను పంపిణీ చేశారు. మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి వై.బాలనాగిరెడ్డికి, ఎంపీ అభ్యర్థి బీ.వై రామయ్యకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ కమిటీ సభ్యుడు విజయేంద్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రవిచంద్రరెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె శివన్న, సర్పంచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం



కోసిగిలోని కడపాళెంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోసిగి: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి వై. బాలనాగిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు, ఉరుకుంద ట్రస్ బోర్డు మెంబర్ బుల్లి నరసింహులు, వెంకటేష్‌లు కోరారు. శుక్రవారం కోసిగిలోని కడపాళెం చింతలగేని వీధిలో ఇంటింటికి వెళ్లి కర పత్రాలు పంపిణీ చేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

కౌతాళం మండలంలో..



ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న జయమ్మ

కౌతాళం: మండల పరిధిలోని కాత్రికి, రౌడూరు, కుంటనహాల్ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేపట్టారు. కాచపురం సర్పంచ్, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సతిమణి వై.జయమ్మ, మండల కన్వీనర్ ప్రహ్లాదచారి తదితరులు ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. టీడీపీ నాయకుల మాటలు నమ్మొద్దని, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తన భర్త బాలనాగిరెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో బాలనాగిరెడ్డి కూతురు ప్రియాంకరెడ్డి, ప్రదీప్‌రెడ్డి భార్య అనూషరెడ్డి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కో ఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, సర్పంచ్‌లు వెంకప్ప, పార్వతమ్మ, నాయకులు నాగభూషణ్‌గౌడ్, పాండురెడ్డి, సోమిరెడ్డి, వడ్డె రాము, భీమేష్, అబ్దుల్ సమద్, మాజీ సర్పంచ్ అవతారం పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకులు, ఐఆర్ఎస్ అధికారి రాకేష్ బడాదియ



ధణాపురం చెక్‌పోస్టు వద్ద వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్ బడాదియ

ఆదోని రూరల్: ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు, ఐఆర్ఎస్ అధికారి రాకేష్ బడాదియ సూచించారు. శుక్రవారం ఆయన సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మతో కలిసి ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. నిరంతరం తనిఖీలు చేయాలని సూచించారు. నగదు, మద్యం, ఇతర వస్తువుల తరలింపు, పంపిణీపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈఎస్ఎమ్ఎస్ అప్లికేషన్, సీ–విజిల్ యాప్ తదితర అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల వ్యయం, ప్రచార సరళిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండలంలోని ధణాపురం చెక్‌పోస్టు వద్ద ఉన్న స్టాటిస్టిక్స్ సర్వేలెన్స్ నిర్వహిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు.

➡ మంత్రాలయం: ఎన్నికల వ్యయ పర్యవేక్షకుడు రాకేష్ బడదీయా మంత్రాలయంలో పర్యటించారు. చిలకలడోన గ్రామం వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో సమావేశమై ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులపై ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వాహనాలు, ప్రచార సాధనలు, ఇతర అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ మురళి, తహసీల్దారు శ్రీధర్‌మూర్తి ఉన్నారు.

ఉరుకుంద ఈరన్న సేవలకు టెండర్లు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయానికి వివిధ సేవల కోసం టెండర్లు దాఖలు చేశారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం టెండర్లను ఓపెన్ చేయగా స్వామికి పూలు సప్లై కోసం రాఘవేంద్ర, శేష వస్త్రాల సప్లై కోసం లక్ష్మీ, వంట చెరకు సప్లై కోసం టి.లక్ష్మి తక్కువకు కోడ్ చేసి దక్కించుకున్నారు. కాగా దేవస్థానం భూముల కౌలుకు నిర్వహించిన బహిరంగ వేలానికి పాటదారులు ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు డీసీ తెలిపారు. కార్యక్రమంలో ఆదోని గ్రూప్ టెంపుల్ ఈఓ రాంప్రసాద్ పాల్గొన్నారు.



రాజీనామా పత్రాలను అధికారులకు అందజేస్తున్న మండిగిరి వలంటీర్లు



రాజీనామా పత్రాలు అందజేస్తున్న పెసలబండ వలంటీర్లు



కౌతాళం ఎంపీడీఓకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న కుంబళనూరు వలంటీర్లు

వలంటీర్ల రాజీనామా

ఆదోని టౌన్/రూరల్: పట్టణంలోని 16 మంది, రూరల్ పరిధిలో 37 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను శుక్రవారం సచివాలయ అడ్మిన్లకు అందజేశారు.

➡ పెద్దకడబూరు: మండల పరిధిలోని బాపులదొడ్డి, పీకలబెట్ట గ్రామ వలంటీర్లు శుక్రవారం తమ రాజీనామా పత్రాలను సచివాలయ సిబ్బందికి అందజేశారు. స్వచ్ఛందంగా సేవలను అందిస్తున్న తమను ప్రతిపక్ష పార్టీ నాయకుల వల్ల పింఛన్ల పంపిణీకి, ఎన్నికల విధులకు దూరం పెట్టడంతో మనస్తాపం చెంది రాజీనామా చేశామన్నారు.

➡ కౌతాళం: మండలంలోని కుంబళనూరు పంచాయతీలో ఐదుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తాకు అందజేశారు.